# అమ్మా శాంభవి.. అన్నపూర్ణేశ్వరీ..


వారాహి అలంకారంలో బాల పోలేరమ్మ


శ్రీ లక్ష్మీసత్యనారాయణస్వామి రంగనాథునిగా..


శ్రీ అన్నపూర్ణగా కళాంబదేవి


భావనా రుషి ఆలయంలో మధురమీనాక్షిగా..


అన్నపూర్ణ దేవి అలంకారంలో శ్రీదేవి భూదేవి


హనుమంత వాహనంపై కడప రాయుడు



కుష్మాండ దేవిగా శ్రీ విజయదుర్గమ్మ


శ్రీ అన్నపూర్ణగానడివీధి గంగమ్మ


శ్రీ అన్నపూర్ణగా లలితాంబిక


అమ్మవారిశాలలో భక్తుల సందడి

**కడప కల్చరల్ :** బుధవారం సాయంత్రం ఆరు గంటలైంది.. నగరంలో అమ్మవారి ఆలయాల సమీపంలోని రహదారులు క్రమంగా భక్తులతో నిండిపోతున్నాయి. రాత్రి 7 గంటలకు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయాలకు చేరుకున్నారు. ధగధగలాడుతున్న విద్యుత్ దీప కాంతుల్లో సువర్ణ ఆభరణాలతో మెరిసిపోతున్న అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని తిలకించి మైమరిచిపోయారు. తమ పిల్లాపాపలను చల్లగా చూడాలని, కష్టాలను తీర్చేందుకు నీవు తప్ప మరొకరు లేరని అమ్మవారిని మనసారా మొక్కుకున్నారు.

■ దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దసరా ఉత్సవాల్లో భాగంగా హనుమంత వాహనంపై భక్తులను కరుణించారు. మాడవీధుల్లో భక్తుల పూజలు అందుకున్నాడు. స్థానిక విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కుష్మాండదేవిగా కొలువుదీర్చారు. ప్రధాన అలంకారానికి ఇరువైపులా విష్ణుమూర్తి, లక్ష్మీమాతలను అలంకరించి కొలువుదీర్చారు. స్థానిక చిన్నారులు ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అలరించాయి.

■ అమ్మవారిశాలలో శ్రీ కన్యకా పరమేశ్వరీని శ్రీ గజలక్ష్మిగా అలంకరించారు. స్థానిక గడ్డిబజారు శ్రీ సత్యదేవుని ఆలయంలో స్వామిని శ్రీ రంగనాథునిగా అలంకరించారు. అదే ప్రాంగణంలోని శ్రీ కళాంబదేవి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించారు. బాల పోలేరమ్మ ఆలయంలో అమ్మవారిని శ్రీ వారాహి దేవిగా అలంకరించారు. శ్రీ రాజరాజేశ్వరీదేవి, శ్రీ లలితాంబిక, ఎర్రముక్కపల్లె చౌడేశ్వరీదేవి తదితర ఆలయాల్లో అమ్మవారిని అన్నపూర్ణగా, భావనారుషి ఆలయంలో అమ్మవారిని మధుమీనాక్షిగా అలంకరించారు. ఇంకా నబీకోట రామలింగ చౌడేశ్వరీ, నాగరాజుపేట రాజరాజేశ్వరి, బేల్దారివీధి గంగమ్మ ఆలయం, రాజారెడ్డివీధిలోని గంగాదేవి, సరస్వతి ఆలయాలలో కూడా ప్రత్యేక అలంకారాలు నిర్వహించారు.

**అన్నపూర్ణ అలంకారం**

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలోని దసరా నవరాత్రుల్లో భాగంగా అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శన మిచ్చారు. అన్నపూర్ణ దేవి అలంకారంలో శ్రీదేవి భూదేవి, గజలక్ష్మీ దేవి అలంకారంలో పార్వతి దేవి దర్శన మిచ్చారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

## క్లుప్తంగా

### ఇసుక ట్రాక్టర్ సీజ్

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** కడప ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు కడప ఎస్ఈబీ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం ప్రభుత్వం నిర్ణయించిన స్టాక్ నుంచి కాకుండా వాటర్ గండి నుంచి అక్రమంగా తీసుకొని వస్తుండగా వినాయక నగర్ వద్ద తమ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ మేరకు సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

### 21న నిరసన

**కడప రూరల్ :** పాలస్తీనాపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 21వ తేదీన కడప నగరంలో నిర్వహించే శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు. పాలస్తీనాపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని పేర్కొన్నారు.

### భూమిపూజ


డ్రైన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు

**కడప కార్పొరేషన్ :** కడప నగరంలోని 39వ డివిజన్‌లో చిలకల బావి సమీపంలో రూ.30లక్షలతో చేపట్టిన సీసీ డ్రైన్ నిర్మాణానికి టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన జిల్లా వాసి కావడం వల్ల కడప నగర అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లు త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 39వ డివిజన్ ఇన్‌చార్జి కమాల్‌బాష పాల్గొన్నారు.

### మానసిక ఆరోగ్యం ప్రధానం



మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్

**కడప స్పోర్ట్స్ :** మానసిక ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని మను పాలిటెక్నిక్‌లో స్టెప్ ఆధ్వర్యంలో 'కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, మానసిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. రిమ్స్ మానసిక విభాగం ప్రొఫెసర్ డా. వెంకటరాముడు మాట్లాడుతూ మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులు డిప్రెషన్‌కు గురవుతారన్నారు. మనం ఆలోచించే విధానం, ప్రవర్తన, భావోద్వేగాలపై ప్రభావం చూపించే ఘటనల గురించి వివరించారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డా. అబ్దుల్ ముక్సిత్‌ఖాన్, ఎన్ఎస్ఎస్ పీఓలు పాల్గొన్నారు.

### ఆధునికీకరణ పనులు ప్రారంభం


పాత బాస్కెట్‌బాల్ కోర్టును నేలమట్టం చేసిన అధికారులు

**కడప స్పోర్ట్స్ :** కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. కడప నగరపాలక కమిషనర్ జి. సూర్యసాయిప్రవీణ్ చంద్ ఆధ్వర్యంలో అధికారులు పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా తొలుత మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టును బుధవారం నేలమట్టం చేశారు. రూ.20 లక్షల అంచనాతో సింథటిక్ కోర్టు ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. దాదాపు 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఈ కోర్టు స్థానంలో నూతన సింథటిక్ కోర్టు ఏర్పాటుకు పనులు ప్రారంభించడం పట్ల క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### భౌతికశాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం


మీనాక్షమ్మ

**వైవీయూ :** వైవీయూ భౌతికశాస్త్ర విభాగం పరిశోధకురాలు ఎ.మీనాక్షమ్మకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ ఫిజిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. రాఘవేంద్ర మార్గదర్శకంలో 'డెవలప్‌మెంట్ ఆఫ్ హైపెర్ఫార్మెన్స్, కాస్ట్ ఎఫెక్ట్ డైసెన్సిటైజ్డ్ సోలార్ సెల్స్ అసిస్ట్ డ్ అన్ కన్వర్షేనల్ మెటీరియల్' అన్న అంశంపై ఈమె చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు.

### బాల్య వివాహాలపై ర్యాలీ

**చెన్నూరు :** బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని అందుకు సహకరించిన వారికి కూడా జైలు శిక్ష తప్పదని ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, సీడీపీఓ రమాదేవిలు హెచ్చరించారు. బుధవారం సర్పంచ్ సిద్ధిగారి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో బాల్యవివాహాలు నిషేధించాలి అంటూ మండలంలో ర్యాలీ నిర్వహించారు.

## హాస్పిటల్ పనులను పూర్తిచేయాలి


రిమ్స్‌లో వైద్యులతో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

**కడప కార్పొరేషన్ :** రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం ఆయన హాస్పిటల్ ఐపీ విభాగం పనులను పరిశీలించారు. ఫ్లోర్‌లో ఎన్ని బ్లాకులు, ఎన్ని గదులు నిర్మిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫ్లోర్‌లోనూ లైట్లు, మరుగుదొడ్లు, ఎమెర్జెన్సీ సిస్టమ్‌లను పరిశీలించారు. ఆస్పత్రికి కావాల్సిన సామాగ్రిని ముందే సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఐపీ విభాగంలోని స్త్రీ, పురుషుల వార్డులను పరిశీలించి వారికి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా అశోక్‌నగర్, కొండాయపల్లె ప్రాంతాలలో పర్యటించారు. అశోక్ నగర్ నుంచి సంజన్న సర్కిల్ వరకు ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ కాలువలో నిర్మాణ లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. పుష్పగిరి స్కూలు మీదుగా 80 అడుగుల రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని, ఆ మేరకు మార్కింగ్‌కూడా ఇవ్వాలన్నారు. కొండాయపల్లె శిశు గృహాలో పలు అభివృద్ధి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ నగర్ వద్ద ఉన్న కల్వర్టును పునర్నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రిమ్స్ అధికారులు పాల్గొన్నారు.

### ● ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



నార్త్ అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధిగా పండుగాయల రత్నాకర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తన పదవీకాలాన్ని నాలుగోసారి పొడిగించారు. బుధవారం ఆయన సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు.

## డిప్యూటీ సీఎంను విమర్శించే స్థాయి మాధవికి లేదు

**కడప కార్పొరేషన్:** డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను విమర్శించే స్థాయి కడప టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవిరెడ్డికి లేదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి రత్నకుమారి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో ఏవైనా ప్రజా సమస్యలుంటే మాట్లాడాలిగానీ, ఊరికే విమర్శించడం సరికాదన్నారు. మాధవి రెడ్డి కడపకు చెందిన వారు కాదని, స్థానికేతరులకు ఇక్కడి సమస్యలు ఎలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు. ఏ ఎన్నికల్లోనూ పోటీ చేసి గెలవని మీకు కార్పొరేటర్‌గా, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అంజద్‌బాషాను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

## రచయిత్రి విజయలక్ష్మి మరణం తీరని లోటు

**కడప కల్చరల్ :** నవలా సాహిత్యంలో ప్రత్యేకముద్ర సాధించిన రచయిత్రి చక్కిలం విజయలక్ష్మి మరణం సాహితీ లోకానికి తీరనిలోటని వైవీయూ పాలక మండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం రచయిత్రి చక్కిలం విజయలక్ష్మి సంస్మరణ సభను నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఆమె రచించిన నవలలు, వాటి ప్రాచుర్యం, ప్రభావం గురించి వివరించారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథపాలకులు రమేశ్‌రావు, రచయిత కొత్తపల్లి రామాంజనేయులు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

■ రచయిత్రి విజయలక్ష్మి మరణం పట్ల మొల్ల సాహితీపీఠం అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు సంతాపం వ్యక్తం చేశారు.

**దుర్భాక రచనలు అజరామరం**

ప్రముఖ కవి దుర్భాక రాజశేఖర శతావధాని రాణా ప్రతాపసింహ చరిత్ర కావ్య రచనతో సాహిత్య చరిత్రలో అజరామరంగా నిలిచిపోయారని వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం దుర్భాక జయంతి నిర్వహించారు.

## ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

**చింతకొమ్మదిన్నె :** ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఊటుకూరు, భగత్‌సింగ్ నగర్ సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. మండలంలోని ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు వైద్యాధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, గూడ ప్రభాకర్ రెడ్డి, నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, కార్పొరేటర్లు చంద్రహాస్‌రెడ్డి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**వల్లూరు :** మండలంలోని కుమారునిపల్లెలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, నాబార్డ్ వారి సౌజన్యంతో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్స్ కళాజాత బృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకులో ప్రజలకు అందుబాటులో వున్న వివిధ పథకాలను గురించి, రుణాలను గురించి వివరించారు. వల్లూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, కళాజాత బృంద సభ్యులు, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అమృత కలశయాత్ర


ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ, ప్రిన్సిపాల్ తదితరులు

**వైవీయూ :** వీరుల త్యాగాలకు గుర్తుగా అమృత కలశయాత్ర నిర్వహించడం, వారిని స్మరించుకోవడం సంతోషంగా ఉందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం వైవీయూ పరిపాలన భవన ప్రాంగణంలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో 'అమృత్ కలశ్‌యాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశ సార్వభౌమాధికారానికి, దేశభక్తికి, ఐక్యతకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఈ పవిత్ర కార్యక్రమంలో బాధ్యులవుతూ విశ్వవిద్యాలయం సేకరించిన మట్టిని ఢిల్లీకి పంపుతామన్నారు. డా. ఎస్. వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘన నివాళి

**కడప ఎడ్యుకేషన్ :** కందుల ఓబుల్‌రెడ్డి తనయుడు కందుల శ్రీనివాసులరెడ్డి వర్ధంతిని బుధవారం కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ కందుల రాజమోహన్‌రెడ్డి విచ్చేసి మాట్లాడారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ మా బాబాయి కందుల శ్రీనివాసులరెడ్డి 1979 సంవత్సరంలో ఢిల్లీలో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ అభ్యసిస్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారని గుర్తుచేసుకున్నారు. కళాశాల సెక్రటరీ కందుల రాజేశ్వరమ్మ, కందుల పద్మావతమ్మ, శకుంతలమ్మ, ప్రధానాచార్యులు వీఎస్ఎస్ మూర్తి, పారిశ్రామికవేత్త రాజోలు వీరారెడ్డి పాల్గొన్నారు.

## మోడీ మాటలను ప్రజలు నమ్మరు

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** దేశ ప్రధాని మోడీ మోసపూరిత మాటలను, ప్రజలు, ఉద్యోగులు నమ్మరని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరాభవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల్లో జరగబోయే, 2024లో రాబోయే లోక్‌సభ ఎన్నికల భయంతోనే ఉద్యోగస్తులకు డీఏలు పెంచడం జరిగిందన్నారు. తొమ్మిది సంవత్సరాల పరిపాలనలో కనపడని ఉద్యోగస్తులు ఎన్నికలు దగ్గర పడేసరికి కనబడ్డారా అని ప్రశ్నించారు. మోడీ పరిపాలనలో ఉద్యోగస్తులకు ఒరిగిందేమీ లేదన్నారు. కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్ అసలే లేదని విమర్శించారు.

## స్కేటింగ్ ఎంపికల్లో కేవీ క్రీడాకారుల ప్రతిభ

**కడప స్పోర్ట్స్ :** కడప నగరంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ ఎంపికల్లో కడప కేంద్రీయ విద్యాలయ క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచినట్లు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మనూష్ మీనా తెలిపారు. పాఠశాల విద్యార్థులు జె. తారక్‌రామ్ 1 స్వర్ణం, 1 రజతం, 1 కాంస్యపతకాలు సాధించాడన్నారు. ఈయనతో పాటు విక్రాంత్ 2 స్వర్ణం, 1 రజతం, జి. సంవిత్ 1 స్వర్ణం, 2 రజతాలు, ఆర్.కె. జెషిక ఏంజిల్ 3 స్వర్ణపతకాలు సాధించినట్లు తెలిపారు. వీరంతా నవంబర్ 11 నుంచి 18వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్కేటింగ్ శిక్షకుడు విలియం కేర్ పాల్గొన్నాడు.